సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం 40 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.

- 8లో



పెరిగిన 'కార్తీక' ఆదాయం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కార్తీకమాసంలో రూ.18 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

- 8లో



నిరుపయోగంగా ప్రాంగణాలు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి.

- 9లో

పోరుకు సన్నద్ధం

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు వేగిరం

- పోలింగ్ కేంద్రాలను ప్రకటించిన ఎన్నికల కమిషన్
- వార్డుకు ఒకటి చొప్పున పోలింగ్ బూత్
- బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు
- బ్యాలెట్ బాక్సులు సిద్ధం
- కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పూర్తవగానే రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశం



సాక్షి,యాదాద్రి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ముగియగానే ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత ఏ క్షణంలో నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచగా.. శనివారం ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఆఫ్‌సెట్ ప్రింటింగ్ యజమానుల నుంచి టెండర్లు ఆహ్వానించేందుకు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వార్డుల వారీగా ఓటరు జాబితా తయారీపై శిక్షణ ఇచ్చేందుకు సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఎంపిక చేసి హైదరాబాద్‌కు పంపనున్నారు.

3,712 పోలింగ్ బూత్‌లు

జిల్లాలోని 426 గ్రామ పంచాయతీల్లో 3,712 వార్డులు ఉన్నాయి. వార్డుకు ఒకటి చొప్పున 3,712 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన జాబితాను రెండు రోజుల క్రితం ఎన్నికల అధికారులు ప్రకటించారు.

ఈ నెలాఖరులో ఓటరు జాబితా..

రిజర్వేషన్లు ఖరారయ్యే లోపు గ్రామ, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఆ మేరకు అధికారులు జాబితాను రూపొందించి ఈనెలాఖరులోగా విడుతల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిన నేపథ్యంలో జాబితాలో అదనంగా మరికొన్ని ఓట్లు చేరే అవకాశం ఉంది.

పోటీకి యువత ఆసక్తి

పంచాయతీ ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న వారిలో ఈసారి కొత్త వ్యక్తులు అధికంగా ఉన్నారు. ప్రధానంగా యువత ఎక్కువ ఆసక్తి చూపుతోంది. అన్ని ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు నలుగురు నాయకులు పోటీ చేసేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. రిజర్వేషన్లు ప్రకటించనప్పటికీ ఆశావహులు టికెట్ కోసం ఇప్పటినుంచే పార్టీ నాయకత్వంతో టచ్‌లో ఉంటున్నారు.

వేడెక్కుతున్న రాజకీయం

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు వేగం పెంచిన నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయం రాజుకుంటోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐలు ప్రజల్లోకి వెళ్లడంపై దృష్టిసారించాయి. తాజా, మాజీలతో పాటు కొత్త వ్యక్తులు సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో తమకంటూ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుని ప్రాభల్యం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు రిజర్వేషన్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రిజర్వేషన్ మారితే పోటీలో ఎవరుంటారు, మారకపోతే ఎవరుంటారనే చర్చ జోరుగా నడుస్తోంది.



సాంస్కృతిక ప్రదర్శనలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్ర తదితరులు

ఏడాదిలోనే పదేళ్ల అభివృద్ధి

- ప్రజలకు పాలన చేరువైంది
- హామీలన్నీ నెరవేరుస్తాం
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరిటౌన్ : బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జరిగిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామేల్, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు పాలన చేరువైందన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలనలో 2,68,790 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 68,80,206 మహిళలు ప్రయాణించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా 1,23,753 మందికి ఉచితంగా 4,09,303 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి వారి ఖాతాల్లో రూ.12.60 సబ్సిడీ జమ చేసినట్లు చెప్పారు. గృహజ్యోతి పథకంలో 1,43,641 కనెక్షన్లకు జీరో బిల్లు వస్తుందన్నారు. 68,584 మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని వివరించారు. ప్రభుత్వం కొలువుదీరిన మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు మహిళా స్వయం సహాయ సంఘాలకు రుణాలు మంజూరు చేశామని వెల్లడించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అలేఖ్య పుంజల బృందం.. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు సౌకర్యం, గృహలక్ష్మి, రుణమాఫీ తదితర పథకాలపై ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, చిన్నారులకు మెమెంటోలు బహూకరించి సత్కరించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



పథకాలపై కళాకారుల ప్రదర్శన

న్యూస్‌రీల్

నకిలీ డిజైన్లపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి : పెటెంట్ హక్కు కల్గిన పోచంపల్లి ఇక్కత్ డిజైన్ల డుప్లికేషన్‌పై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని భువనగిరి ఎంపీ, టెక్స్‌టైల్ స్టాండింగ్ కమిటీ మెంబర్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆది వారం పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోషియేషన్ ఆధ్వర్యంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి పోచంపల్లి ప్రింటింగ్ వస్త్రాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఎంపీ స్పందించి చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలని, కొత్త చేనేత పథకాలను అమలు చేయాలని ఎంపీకి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ తడక యాదగిరి, కొట్టం కరుణాకర్‌రెడ్డి, చేనేత నాయకులు కర్నాటి బాలరాజు, కుడికాల రామనర్సింహ, గంజి బాలరాజు, మంగళపల్లి రమేశ్, సీత భవానీ, సీత కృష్ణ, గుండు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

11న అయ్యప్ప మాలధారుల గిరిప్రదక్షిణ

యాదగిరిగుట్ట : అయ్యప్పమాల ధరించిన భక్తుల సౌలభ్యం కోసం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 11వ తేదీన గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీస్వామివారి మహిమాన్వితాన్ని చాటే విధంగా ఆలయ చరిత్రలోనే మొదటిసారిగా అయ్యప్పమాలధారుల కోసం ప్రత్యేకంగా గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభం అవుతుందని, 7నుంచి 8.45 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప మాలధారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏం సాధించారని సంబురాలు?



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా సాధించింది ఏమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ఏం సాధించారని సంబురాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. చౌటుప్పల్‌లోని రంగారెడ్డి స్మారక భవనంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. రుణమాఫీ జరగక, రైతుభరోసార అందక రైతులు నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. విధానాలు మార్చుకోకపోతే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ సర్కార్‌కు పడుతుందన్నారు. ప్రజాసమస్యలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై చౌటుప్పల్‌లో జరిగే జిల్లా మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, కృష్ణారెడ్డి, పాష, నర్సింహ, మధుకృష్ణ, కిష్టయ్య, బాలయ్య, నందీశ్వర్, యాదయ్య పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన సర్పంచుల ఫోరం జేఏసీ నేతలు



కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ నాయకులు

సంస్థాన్ నారాయణపురం: రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్రి యాదయ్య ఆధ్వర్యంలో ఆదివారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. ఒక్కో గ్రామ పంచాయతీలో రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని జేఏసీ అధ్యక్షుడు యాదయ్య తెలిపారు. కేసీఆర్ పాలనలోనే పల్లెలు ప్రగతిపథంలో పయనించాయన్నారు.

'పిలాయిపల్లి'లో కాలుష్యపు నురగలు



మైసమ్మ కత్వ సమీపంలో పిలాయిపల్లి కాలువలో పరుగులు తీస్తున్న కాలుష్యపు నురగలు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల శివారులోని మైసమ్మకత్వ సమీపంలోని పిలాయిపల్లి కాలువలో కాలుష్యపు నురగలు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాడల నుంచి నిత్యం వ్యర్థ రసాయనాల కాలుష్యమంతా యథేచ్ఛగా మూసీలోకి వచ్చిచేరుతోంది. దాంతో మూసీ కాలుష్యం కాసారంగా మారింది. ఈ మూసీ నీళ్లే పిలాయిపల్లి కాలువ ద్వారా పంట పొలాలకు సాగుకు అందుతుంది. కాగా రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరద కాస్త పెరగడంతో పిలాయిపల్లి కాలువలో ఇలా తెల్లటి పాల లాంటి కాలుష్యపు నురగలు పరుగులు పెడుతున్నాయి.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ చేపట్టి గర్భాలయంలోని స్వయంభూలకు నిజాభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా చేపట్టారు. అలాగే గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం జోడు సేవను ఆలయంలో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

10 కిలో మీటర్లు.. ఏడు మలుపులు

- చేనేత, పర్యాటక ప్రాంతం కావడంతో నిత్యం రద్దీగా రహదారి
- మలుపుల వద్ద అదుపు తప్పుతున్న వాహనాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- సూచిక బోర్డులు, రక్షణ గోడలను మరిచిన అధికారులు
- జలాల్‌పురం ఘటనతోనైనా కనువిప్పు కలిగేనా..

భూదాన్‌పోచంపల్లి - కొత్తగూడెం రోడ్డుపై ప్రమాదకర మూలమలుపులు



రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న జలాల్‌పురం చెరువు

భూదాన్‌పోచంపల్లి : పర్యాటక కేంద్రమైన భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రం నుంచి హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి కొత్తగూడెం ఎక్స్ రోడ్డు వరకు ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం పోచంపల్లికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరితో పాటు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడానికి వచ్చే వినియోగదారులతో ఈ దారి రద్దీగా ఉంటుంది. కానీ, మలుపుల వద్ద సూచికల బోర్డులు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు గమనించక అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సింగిల్‌గా ఉన్న ఈ రోడ్డును 11 సంవత్సరాల క్రితం డబుల్ రోడ్డుగా విస్తరించారు. దాంతో రోడ్డు సాఫీగా ఉండటంతో మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ ప్రమాదాల బారినపడుతున్నారు.

ప్రమాదకరమైన మలుపులు ఇవీ..

భూదాన్‌పోచంపల్లి నుంచి కొత్తగూడెం వరకు 10 కిలో మీటర్ల రహదారిలో 7 మూలమలుపులు ఉన్నాయి. ఇందులో 6 మూలమలుపులు ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారాయి. జలాల్‌పురం చెరువుకట్టకు ఇరువైపులా ఉన్న రెండు మలుపులతో పాటు మోడల్‌స్కూల్ బస్టాప్ వద్ద, పలాడియా వెంచర్ సమీపంలో, మైసమ్మకత్వ, శాంతినిలయం అనాథ ఆశ్రయం సమీపంలో ఉన్న మలుపులు డేంజర్‌గా ఉన్నాయి. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేంత వరకు కన్పించడం లేదు.

ప్రాణాలు పోతున్నా పట్టింపులేదు!

ప్రమాదకర మలుపుల వద్ద వాహనదారులను హెచ్చరిస్తూ రాత్రిపూట కూడా గుర్తించేలా రేడియంతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు మరిచారు. అలాగే అత్యంత ప్రమాదకరంగా మారిన జలాల్‌పురం చెరువు కట్ట సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు, కట్ట వెంట రక్షణగోడ లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు మూలమలుపు వద్ద అదుపు తప్పి చెరువులో పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి.ఈ ప్రమాదాల్లో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోగా, మరెందరో గాయాలపాలయ్యారు. శనివారం ఉదయం జరిగిన ఘటనలో కూడా ఐదుగురు యువకులు ప్రాణాలొదిరారు.



మైసమ్మ కత్వ సమీపంలో ప్రమాదకర మలుపు

> రహదారులపై ఉన్న మూలమలుపులు.. ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేదాకా కనిపించక ఢీకొన్న ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రాణాలు పోతున్నా, క్షతగాత్రులుగా మారుతున్నా అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

అధికారులు మేల్కొనాలి



మూలమలుపు వద్ద సూచికలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జలాల్ పురం చెరువుకట్టకు ఇరువైపులా ఉన్న మలుపుల వద్ద చాలా ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందినా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. ఇకనైనా మేల్కొని రెయిలింగ్, స్పీడ్ బ్రేకర్లు, వేయాలి

– గోరంటి ప్రదీప్‌రెడ్డి, జలాల్‌పురం

ఆదమరిస్తే చెరువులోకే..

- 65వ నంబర్ హైవేకు ఆనుకుని పెద్దకాపర్తి చెరువు
- మూలమలుపు ఉన్నా.. హెచ్చరిక బోర్డులు లేవు



పెద్దకాపర్తి శివారులో హైవేపై పెద్దచెరువు వెంట మూల మలుపులో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన రెయిలింగ్

చిట్యాల : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి వెంట చిట్యాల మండలం పెద్దకాపర్తి పెద్దచెరువుతో ప్రమాదం పొంచి ఉంది. ఈ చెరువు జాతీయ రహదారి వెంట 600 మీటర్ల మేర ఉంది. చెరువు వెంట రహదారిపై మూల మలుపులు సైతం ఉన్నాయి. ఇది నిత్యం నిండుకుండలా ఉంటుంది. అయినా ఇక్కడ రక్షణ గోడలు, హెచ్చరిక సూచికలు లేవు. శనివారం భూదాన్‌పోచంపల్లి మండలం జాలాల్‌పురం మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు యువకులు మృతిచెందిన విషయం తెలిసిందే. హైవే వెంట ఉన్న పెద్దకాపర్తి చెరువు వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

తక్కువ ఎత్తులో రెయిలింగ్..

పెద్దకాపర్తి పెద్దచెరువులో రెండేళ్ల క్రితం వరకు వర్షాకాలంలో మాత్రమే నీరుండేది. ప్రస్తుతం పిలాయిపల్లి కాల్వను అనుసంధానించడంతో చెరువు నిత్యం నిండుకుండలా ఉంటుంది. రోడ్డు వెంట చెరువు 600 మీటర్ల పరిధిలో ఉంటే.. రెయిలింగ్ కేవలం 100 మీటర్లు మాత్రమే ఉంది. అది కూడా తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. చెరువు అలుగు ప్రాంతం కూడా రోడ్డుకు సమీపంలోనే ఉంది. అక్కడా ఎలాంటి రక్షణ గోడలు లేవు. చెరువు వెంట రోడ్డుపై లైటింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. అతివేగంతో వెళ్లే వాహనాలు అదుపుతప్పితే చెరువులో పడి పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

రాంగ్ రూట్‌లో జర్నీ

చిట్యాల వైపు నుంచి పెద్దకాపర్తిలోపలికి వచ్చేందుకు హైవే కిందినుంచి నిర్మించిన అండర్ బ్రిడ్జి చిన్నగా ఉంది. స్కూల్ బస్సులు, లారీలు, వరికోత యంత్రాలు అండర్ బ్రిడ్జి నుంచి రాలేవు. దీంతో హైవేపై రాంగ్ రూట్‌లో వచ్చి పెద్దచెరువు వద్ద యూటర్న్ తీసుకుని చెరువు వెంట ఉన్న రహదారి మీదుగా పెద్దకాపర్తిలోకి వెళ్తుంటాయి. పెద్దకాపర్తి చెరువువద్ద వాహనాలు 40 కిలోమీటర్ల వేగంతోనే వెళ్లాలని సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. కానీ 100 కిలో మీటర్ల పైగా వేగంతో వెళ్తుంటాయి. ఇదేకాకుండా చిట్యాల నుంచి పెద్దకాపర్తికి వెళ్లే దారిలోని యూటర్న్ వద్ద కల్వర్టు ఉంది. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

లైటింగ్, గోడ ఏర్పాటు చేయాలి



పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని పెద్దచెరువుపై జాతీయ రహదారి వెంట చెరువు వద్ద పూర్తిస్థాయిలో రక్షణ గోడలు లేవు. దీంతో అతివేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే చెరువులోకి వెళ్లే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకుని చెరువు ఉన్నంత వరకు రక్షణ గోడలను నిర్మించడంతోపాటు రోడ్డు వెంట పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– నూతి వెంకటేశం, పెద్దకాపర్తి



పలాడియా వెంచర్ సమీపంలో సూచికలు లేని మలుపు



మోడల్‌స్కూల్ బస్టాప్ సమీపంలో..



జలాల్‌పురం చెరువు కట్ట సమీపంలో..



శాంతినిలయం అనాథాశ్రమం వద్ద..

క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, కర్నాటి నాగేశ్వర్‌రావు, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో.. ఒకరు మృతి



మృతిచెందిన రాంబాబు

మునగాల: మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో పోలేనిగూడెం వెళ్లే రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజుర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన కందుల రాంబాబు(32) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాంబాబు ఆదివారం తన బంధువైన గొట్టెముక్కల మధును హైదరాబాద్‌కు పంపించేందుకు బైక్‌పై బరాఖత్‌గూడెం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. బైక్‌ను పోలేనిగూడెం నుంచి బరాఖత్‌గూడెం వైపు వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నుజ్జునుజ్జయింది. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మామపై కోడలు దాడి

వేములపల్లి: మామపై కోడలు చెప్పుతో దాడి చేసిన ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగనపల్లి బుచ్చిరెడ్డి, అనసూర్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి, చిన్న కుమారుడు శేఖర్‌రెడ్డికి చెరో మూడెకరాల చొప్పున భూమి పంచి ఇచ్చారు. ఇంకా బుచ్చిరెడ్డి పేరు మీద 20 గుంటలు, అనసూర్య పేరు మీద 3.10 ఎకరాల భూమి ఉంది. వారి భూమిని ఇద్దరు కుమారులు చెరి కొంచెం సాగు చేసుకుని కౌలు ఇచ్చేటట్లు మాట్లాడుకున్నారు. అయితే గత సంవత్సరం కాలంగా పెద్ద కుమారుడైన శ్రీనివాస్‌రెడ్డి, కోడలు మణిమాల తమకు కౌలు ఇవ్వడం లేదని బుచ్చిరెడ్డి ఆరోపిస్తున్నాడు. ఇదే విషయమై గత నెల 20న బుచ్చిరెడ్డి కోడలు మణిమాలను ప్రశ్నించడంతో ఆమె కోపోద్రిక్తురాలై తనపై చెప్పుతో దాడి చేసిందని బుచ్చిరెడ్డి పేర్కొన్నాడు. దీంతో గత నెల 21న వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మణిమాలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు బుచ్చిరెడ్డి తెలిపాడు.

కుక్కల దాడిలో ఎనిమిది గొర్రె పిల్లలు మృతి



మృతిచెందిన గొర్రె పిల్లలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): కుక్కల దాడిలో ఎనిమిది గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన చింతలపాలెం మండలం దొండపాడులో ఆదివారం జరిగింది. దొండపాడు గ్రామానికి చెందిన దొంగల సైదులు ఆదివారం తన గొర్రెలను మేతకు పంపి వాటి పిల్లలను దొడ్డిలోనే కట్టి ఉంచాడు. మధ్యాహ్నం సమయంలో దాదాపు 7 వీధి కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేశాయి. ఇంట్లో ఉన్న వారు గమనించి కుక్కలను వెళ్లగొట్టారు. గొర్రె పిల్లలను పరిశీలించగా 8 మృతిచెందాయి. దాదాపు రూ.45 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

పెరిగిన 'కార్తీక' ఆదాయం

- యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కార్తీకమాసంలో రూ.18.03కోట్ల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే రూ.2.95కోట్లు అదనం



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి కార్తీక మాసంలో ఆదాయం పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.2,95,03,389 పెరిగినట్లు ఆలయాధికారులు శనివారం వెల్లడించారు. గతేడాది కార్తీక మాసంలో రూ.15,08,36,611 ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ.18,03,40,051 వచ్చింది.

వ్రతాలకు రూ.21.89లక్షలు

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులు అధికంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను జరిపించారు. గతేడాది కార్తీక మాసంలో రూ.1,64,20,600 ఆదాయం రాగా.. ఈ కార్తీక మాసంలో రూ.1,86,10,400 ఆదాయం వచ్చింది. అంటే గతేడాదితో పోలిస్తే ఈ కార్తీకమాసంలో రూ.21,89,800 అధికంగా వచ్చింది. ఇక ప్రసాద విక్రయంలో సైతం గతేడాది కంటే ఎక్కువగా రాబడి వచ్చింది. గతేడాది కార్తీకంలో రూ.3,50,70,660 రాగా.. ఈ కార్తీక మాసంలో రూ.3,71,94,240కి పెరిగింది. విమాన గోపురానికి గతేడాది కార్తీక మాసంలో రూ.1,120 మాత్రమే విరాళాలు వస్తే.. ఈ ఏడాది రూ.25,52,578 విరాళాలు వచ్చాయి.

వివిధ విభాగాల్లో పెరిగిన ఆదాయం ఇలా..

పూజలు	2023 (రూ.లలో)	2024(రూ.లలో)
కల్యాణ కట్ట	18,84,900	20,09,350
ప్రధాన బుకింగ్	65,12,738	76,20,176
బ్రేక్ దర్శనం	70,19,100	81,01,000
వ్రత పూజలు	1,64,20,600	1,84,10,400
వాహన పూజలు	3,91,600	3,75,600
వీఐపీ దర్శనం	99,00,000	1,37,48,550
శీఘ్ర దర్శనం	1,91,950	1,72,600
ప్రచారశాఖ	15,04,257	10,78,018
కొండపైకి వాహనాల ప్రవేశం	1,13,50,000	1,23,50,000
యాదరుషి నిలయం	28,18,165	32,21,804
స్వర్ణ పుష్పార్చన	27,61,200	19,05,300
శివాలయం	3,79,550	4,87,150
శాశ్వత పూజలు	8,00,001	6,85,000
పుష్కరిణి స్నాన సంకల్పం	55,450	42,750
లాకర్స్	-	7,040
ప్రసాద విక్రయం	3,50,79,660	3,71,94,240
లీజు అండ్ లైసెన్స్	45,70,702	74,07,722
హుండీల ద్వారా	2,36,80,641	3,75,20,004
ఇతర పద్దుల ఆదాయం	2,37,89,517	2,27,56,628
అన్న ప్రసాదం	17,25,510	24,94,141
విమాన గోపురానికి విరాళం	1,120	25,52,578
మొత్తం	**15,08,36,661**	**18,03,40,051**

విగ్రహాలు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

- పంచలోహ విగ్రహాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను ఆదివారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బీబాద్ద మంజీత్‌సింగ్ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌లో ఉంటున్న తన అత్తగారింటికి అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉండేవాడు. అతడు శుక్రవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డులో గల పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ గర్భగుడికి వేసిన తాళం పగులగొట్టి ఉత్సవమూర్తుల పంచలోహ విగ్రహాలతో పాటు రెండు బంగారు పుస్తెలు చోరీ చేశాడు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రధాన కూడళ్లలోని సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడి కోసం రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం నిందితుడు చోరీ చేసిన సొత్తును టీవీఎస్ మోపెడ్‌పై పెట్టుకుని మిర్యాలగూడ పట్టణం నుంచి కోదాడ వైపు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు ఆగస్టు నెలలో యాద్గారిపల్లిలోని పార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి దేవాలయంలో 4 అమ్మవారి పట్టు చీరలను చోరీ చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ లోకేష్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌ను డీఎస్పీ అభినందించారు.

హోంగార్డు ఇంట్లో చోరీ..

మిర్యాలగూడలోని ఇందిరమ్మకాలనీలో హోంగార్డు ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర రాజు తెలిపారు. ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం హోంగార్డు ఇంట్లోకి చొరబడిన నిందితుడు బీరువాలోని రూ. 1.80 లక్షలు చోరీ చేశాడు. నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసి రూ.1.79 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి వివరాలను వెల్లడించకుండా పోలీసులు గోప్యత పాటించడం గమనార్హం.

యాదగిరీశుడి ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో హైదరాబాద్- సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరీశుడితో పాటు కొండపైనే శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని, అనుబంధ పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సైతం భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.63,17,011 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



ఆలయ ముఖ మండపంలో స్వామి వారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

కట్టంగూర్: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన కొప్పు నాగరాజు(38) తనకున్న ఎకరం 10 గుంటల భూమితో పాటు మరో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.6లక్షలు వరకు అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగ్గా రాక అప్పులు అధికమయ్యాయి. అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురైన నాగరాజు గత నెల 21వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీదర్ తెలిపారు.

వృద్ధ దంపతులకు షష్టిపూర్తి



లచ్చిరెడ్డి-అక్కమ్మ దంపతులకు షష్టిపూర్తి చేస్తున్న కుటుంబ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు 95సంవత్సరాల కర్నాటి లచ్చిరెడ్డి, 89సంవత్సరాల అక్కమ్మకు ఒక కుమారుడు, నలుగురు కూమార్తెలు ఉన్నారు. కాగా ఆదివారం లచ్చిరెడ్డి దంపతులు వారి మూడు తరాల కుటుంబ సభ్యులైన 70మందితో కలిసి ఘనంగా షష్టి పూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వృద్ధ దంపతులు మాట్లాడారు. బంధాలు బంధుత్వాలు మంట కలిసిపోతున్న ఈ రోజుల్లో ఇంత మందిని ఒకే వేదిక వద్ద కలుసుకుని పండుగ వాతావరణంలా కార్యక్రమాన్ని చేసుకోవడం మాకు చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు వారితో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొండపాటి ఆదిరెడ్డి, బలుపునూరి వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సామిరెడ్డి, సీతారాంరెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరిరెడ్డి, కుమారుడు కర్నాటి సైదిరెడ్డి, కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు, పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతులు



ప్రోత్సాహక బహుమతి సాధించిన గైగుళ్ల హేమశ్రీ



భగవద్గీత కంఠస్థ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన మహ్మద్ ఆయేషా ఫాతిమా

సూర్యాపేట : విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో సూర్యాపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించినట్లు దేవాలయాలు, ధార్మిక సంస్థల ఐక్యవేదిక కన్వీనర్లు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం పట్టణంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గెలిచిన నవోదయ పాఠశాలకు చెందిన మహ్మద్ ఆయేషా ఫాతిమా, గైగుళ్ల హేమశ్రీలు హైదరాబాద్ రామంతాపూర్‌లోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ద్వితీయ, ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు వారు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మృతి

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద నిద్ర చేసేందుకు వచ్చిన మహిళకు బీపీ తగ్గి స్పృహ తప్పి కిందపడిపోవడంతో ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం పాలకవీడు ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం పెద్ద సీతారాంతండాకు చెందిన బాణోతు విజయ(40) తన అక్క బాణోతు అస్సీతో కలిసి గురువారం పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద నిద్ర చేసేందుకు వచ్చింది. వీరికి పరిచయం ఉన్న నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన పబ్బతి శరత్ కూడా దర్గా వద్దకు వచ్చాడు. గురువారం రాత్రి దర్గా వద్ద విజయకు బీపీ తగ్గడంతో స్పృహతప్పి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విజయ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందింది. తన భార్య మృతి పట్ల అనుమానం ఉందని విజయ భర్త లక్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూడు లక్షల విత్తనాలు సేకరణ

- వన జీవి రామయ్యకు అందజేసిన మిర్యాలగూడ పట్టణ యువకులు



వన జీవి రామయ్య దంపతులను సన్మానిస్తున్న యువకులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన యువకులు మూడు లక్షల విత్తనాలను సేకరించారు. ఈ విత్తనాలను ఆదివారం ఖమ్మంలో వన జీవి రామయ్యకు అందజేశారు. అనంతరం వన జీవి రామయ్యను దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వన జీవి రామయ్య మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని సూచించారు. తాను చిన్నతనం నుంచి మొక్కలను నాటడంతో పాటు విత్తనాలు సేకరించేవాడినని పేర్కొన్నారు. వేప, గానుగ, మర్రి, రాగి, నేరేడు, చింత వంటి విత్తనాలను ఎక్కువగా సేకరించాలని, అదేవిధంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే టేకు, ఎర్రచందనం, అశ్వగంధ వంటి మొక్కలను నాటే విధంగా చూడాలన్నారు. విత్తనాలను సేకరించిన వారిలో అవిరెండ్ల సందీప్‌కుమార్, దైద శ్రీనివాస్, దైద కిరణ్, ఎస్‌కే రూహిద్, కందికంటి విష్ణు, ఉబ్బపల్లి పవన్, సైదులు, దైద పవన్, కొత్తపల్లి మణి, ప్రకాష్, ఉపాధ్యాయుడు డబ్ల్యూఈఓ ఫౌండర్ ఎస్‌కే మహమ్మద్ పాష, శ్రీరంగం సంపత్ తదితరులున్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



చౌటుప్పల్ బస్టాండ్ ప్రాంగణంలో ఆగిపోయిన బస్సును తోస్తున్న ప్రయాణికులు

చౌటుప్పల్: చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం హయత్‌నగర్ డిపోకు చెందిన దిల్‌సుఖ్‌నగర్-చౌటుప్పల్ మెట్రో షటిల్ సర్వీస్ బస్సు మొరాయించింది. ప్రయాణికులతో బస్టాండ్‌కు వచ్చిన బస్సు ప్లాట్‌ఫాం మీదుకు వెళ్తుండగా బస్టాండ్ ప్రాంగణంలో ఆగిపోయింది. ఇతర బస్సులు ప్లాట్‌ఫాం పైకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రయాణికులు బస్సును ముందుకు లేదా వెనుకకు తోసేందుకు ప్రయత్నించినప్పటికీ అది కదలకపోవడంతో అక్కడే వదిలేశారు. మెకానిక్‌లను సంప్రదించిన బస్సు డ్రైవర్ పలు ప్రయత్నాలు చేయగా గంట సేపటి తర్వాత బస్సు స్టార్ట్ అయ్యింది. అనంతరం ప్రయాణికులను ఎక్కించుకుని దిల్‌సుఖ్‌నగర్‌కు బయల్దేరి వెళ్లింది.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై నెలకొన్న వాహనాల రద్దీ

చౌటుప్పల్ : పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. వివాహాది శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో పాటు వీకెండ్ కూడా తోడవ్వడంతో రద్దీ విపరీతంగా ఏర్పడింది. అదే విధంగా చౌటుప్పల్‌లో వారాంతపు సంత ఉండడం హైవేపై మరింత రద్దీ కనపడింది. దీంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పట్టణంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద హైవేపై జంక్షన్‌ను పోలీసులు మూసివేశారు. హైవేపై జంక్షన్ నుంచి వెళ్లలేక, దూరంగా వెళ్లి తిరిగిరాలేక వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండ్..

పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో పాటు వీకెండ్ రావడంతో పట్టణంలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి రాకపోకలు సాగించాయి.

స్కూటీని ఢీకొట్టిన కారు.. మహిళ మృతి

- కుమారుడికి తీవ్ర గాయాలు




రేష్మ (ఫైల్)

నల్లగొండ క్రైం: స్కూటీపై వెళ్తున్న మహిళను కారు ఢీకొట్టడంతో మృతిచెందింది. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం జరిగింది. టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లు సమీపంలో గల లెప్రసీ కాలనీకి చెందిన రేష్మ(34) ఆదివారం స్కూటీపై తన కుమారుడు రెహమాన్‌తో కలిసి నార్కట్‌పల్లి అద్దంకి బైపాస్ మీదుగా మిర్యాలగూడ వైపు నుంచి పానగల్లు వైపు వస్తుండగా.. వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేష్మ అక్కడికక్కడే మృతిచెందగా.. ఆమె కుమారుడు రెహమాన్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలించారు. కారు నడుపుతున్న సత్యనారాయణ అజాగ్రత్త వలనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలు ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తోందని, కొంతకాలంగా ఆమె తన భర్తకు దూరంగా ఉంటుందని తెలిసింది. మృతురాలి తల్లి గౌస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ

- రోజుకో కొత్త తరహాలో సైబర్ నేరాలు
- పీఎం కిసాన్ యోజన పేరుతో వాట్సాప్‌లలో చక్కర్లు కొడుతున్న నకిలీ లింక్‌లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్న నకిలీ ఏపీకే ఫైల్స్

చౌటుప్పల్ రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ రోజువారి కార్యకలాపాల్లో అమలు చేస్తుండగా.. సైబర్ నేరగాళ్లు అంతకుమించిన టెక్నాలజీని వినియోగిస్తూ అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన సైబర్ నేరగాళ్లకు మంచి అవకాశంగా మారింది. విద్యావంతులతో పాటు సామాన్య ప్రజలు కూడా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ఇదే సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది.

ఏపీకే ఫైళ్లతో ప్రమాదం..

సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్(ఏపీకే) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేసి ఓకే అని క్లిక్ చేస్తే.. సంబంధిత వ్యక్తుల ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి. ఫలితంగా మనకు సంబంధ లేకుండానే మన ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తోంది. తమ ఫోన్ హ్యాక్ అయ్యిందని తెలియని వారు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే హ్యాక్ చేసిన మొబైల్ నంబర్ ద్వారా పిన్ నంబర్ తెలుసుకుని నిమిషాల్లో ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. హ్యాక్ చేసిన మొబైల్ డివైస్ డిస్‌ప్లే సైబర్ నేరగాళ్ల చేతిలో ఉంటుంది. దీని ప్రకారం ఆ ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్ నంబర్లకు ఫోన్ హ్యాకింగ్‌కు గురైన వ్యక్తి పంపినట్లు ఏపీకే ఫైళ్లను పంపుతున్నారు. నిజంగానే మనకు తెలిసిన వ్యక్తి నుంచే ఈ మెసేజ్ వచ్చిందని భావించి ఏపీకే ఫైళ్ల లింక్ ఓపెన్ చేస్తున్నారు. దీంతో బ్యాంకు ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ యోజన పథకం పేరిట లింక్ పంపుతున్నారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసినా కూడా ఫోన్ హ్యాక్ అయ్యి మనకు సంబంధం లేకుండానే బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులను సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే అనవసర లింక్‌లను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలోని సొమ్ము ఖాళీ అవ్వడం ఖాయం.

నకిలీ లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాల పేరుతో లింక్‌లు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేస్తే సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కినట్లే అవుతుంది. ఎవరైనా సైబర్ మోసానికి గురైనా, ఫోన్ హ్యాక్ అయ్యి తమ ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ నంబర్ 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– మన్మథకుమార్, చౌటుప్పల్ సీఐ

విద్యా వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలోని మార్పులు తీసుకువస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ 5వ జిల్లా మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ ఉద్యోగులకు 1వతేదీలోపు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారని, పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టి ప్రయోజనం కల్పించారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలు ఇతర సమస్యలను విడతల వారీగా ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. సభలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు దామోదర్, యాదయ్య, నాగమణి, వెంకటాచారి, వనిత, మల్లేశం, సైదులు, సుదర్మారెడ్డి, ముత్యాలు, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.